క్లుప్తంగా

స్వీయరక్షణతో మహిళలకు ధైర్యం


శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

అద్దంకి రూరల్: మహిళలు ప్రతి రంగంలో ముందంజలో ఉండాలని కేఆర్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు అన్నారు. మహిళా సాధికారిత సమితి వారి ఆధ్వర్యంలో తైక్వాం డోలో ఐదు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వీయరక్షణ అవసరమన్నారు. తైక్వాండో కోచ్ టి. అంకరాజు, పీవీ. ఝాన్సీ లక్ష్మీలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఅండ్‌ఏసీ కోఆర్డినేటర్ ఎస్ దాస్, మహిళా సాధికారిత సమితి కన్వీనర్ పీవీ హేమలత, ఎన్ షర్మిలారాణి, డీ. రాజశేఖర్, సుబ్బారావు, రామకృష్ణ, శికామణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

11న విశ్వరూప సభ


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అద్దంకి రూరల్: ఈ నెల 11న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విశ్వరూప సభ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి జంద్రాజుపల్లి ఆంజనేయులు మాదిగ కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమాయత్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎస్‌ఎఫ్ అనుబంధ సంఘాల మండల నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు, పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వరగాని రమేష్, చక్రవర్తి, అంతోని, నరేంద్ర, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి కోరుతూ పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

చీరాల అర్బన్: పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌళిక వసతులు మెరుగుపరచాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య కోరారు. చీరాల ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచే విధంగా పారిశ్రామిక అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం స్థానిక స్వర్ణగేటు సెంటర్ నుంచి పాదయాత్రను ఆయన ప్రారంభించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రకృతి వనరులను, దేశ ప్రజల ఆస్తులైన ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్‌లకు అమ్మివేయడమే పనిగా పెట్టుకుందన్నారు. ప్రజా సమస్యలే అజెండాగా సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు చేస్తుందన్నారు. ఈనెల 8న బస్సుయాత్ర చీరాల పట్టణానికి వస్తుందన్నారు. పాదయాత్రలో సీపీఎం కార్యదర్శి ఎస్.బాబూరావు, ఎల్.జయరాజు, ఎం.వసంతరావు, పి.కొండయ్య, డి.నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐగా శేషగిరిరావు బాధ్యతల స్వీకరణ


శేషగిరిరావు, సీఐ

చీరాల: చీరాల ఒన్‌టౌన్ సీఐగా శేషగిరిరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లి నుంచి చీరాల ఒన్‌టౌన్‌కు ఆయన ఇటీవల బదిలీ కాగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒన్‌టౌన్ సీఐగా పని చేసిన మల్లికార్జునరావు మంగళగిరికి బదిలీ కాగా అప్పటి నుంచి టూటౌన్ సీఐ సోమశేఖర్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో శేషగిరిరావు చీరాల ఒన్‌టౌన్ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సైలు, సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు కాపాడతానని ఆయన అన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో ఉమాదేవి

అద్దంకి రూరల్: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈఆర్‌వో ఉమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉమాదేవి అధ్యక్షతన నియోజకవర్గ ఎన్నికల ప్రణాళికలను చర్చించారు. ఐదు మండలాల తహసీల్దార్‌లు, ఎస్సైలు, సీఐలు, బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు, 2014, 2019 పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల్లో జరిగిన ఘటనలు చర్చించారు. పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో తదుపరి ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు.

పోషకాల ఫోర్టిఫైడ్

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంతో ప్రయోజనం
- పోషకాహార లోపాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- అంగన్‌వాడీల అవగాహన కార్యక్రమాలు


ఫోర్టిఫైడ్ రైస్ ప్యాకెట్‌తో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందిస్తున్న వెంకటేష్ (ఫైల్)

వేటపాలెం: గత ప్రభుత్వాలు తూతూ మంత్రంగా ఏదో ఒక ఒకటి అందించాం అని చేతులు దులిపేసుకున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోలేదు. ఫలితంగా పౌష్టికాహార లోపంతో ఎంతో మంది చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అనారోగ్య బారిన పడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడ్డారు. ఈ నాలుగున్నరేళ్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంటి వద్దకే పౌష్టికాహారాన్ని అందించి చరిత్ర సృష్టించింది ప్రభుత్వం. సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, ఆరోగ్యం విషయంలో ఎంత ముందుచూపుతో ఉన్నాడని ప్రజలు అనందం వ్యక్తం చేస్తున్నారు. పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మాతాశిశు మరణాల నియంత్రణ, పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించిన ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్‌తో సమస్యకు చెక్ పెడుతోంది. పోషకాలు శరీరాన్ని చేరేందుకు వేసుకోవాల్సిన మాత్రలు, ప్రత్యేక ఆహారాల పట్ల ఎందరో గర్భిణులు, బాలింతలు అవగాహన రాహిత్యంతో వ్యవహరిస్తున్నారు. ఈ స్థితి ప్రసవించే వారిలో శిశువుల ఎదుగుదల లోపాలకు కారణమవుతోంది. ఆరోగ్య పరమైన అనేక సమస్యలను పరిష్కారంగా ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం పరిచయం చేసింది. ఈ బియ్యం అందుబాటులోకి వచ్చి నెలలు గడిచినా ఇప్పటికీ వినియోగంపై అపోహలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యం అంటే..

ఫోర్టిఫైడ్ బియ్యం వాడుక భాషలో బలవర్థక బియ్యంగా పిలుస్తారు. సాధారణ బియ్యానికి ఈ బియ్యానికి అనేక అంశాల్లో సారూప్యత ఉంది. వాటితో పోల్చుకుంటే బలవర్థక బియ్యంలో పోషకాలు మెండు. పోషకాలను బియ్యం రూపంలో మార్చి ప్రత్యేక గింజలు తయారు చేసి సాధారణ బియ్యంలో కలుపుతారు. వీటిని జతచేసి పంపిణీ చేస్తారు. ఈ కృత్రిమ బియ్యాన్ని కెర్నల్స్ అంటారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ప్రతి 100 కిలోల బియ్యానికి వ్యక్తి ఆరోగ్య స్థితి అవసరాన్ని బట్టి బాలింతలకా, గర్భిణులకా, లేదా సాధారణ వ్యక్తులకా అనే అంశం పరిగణలోకి తీసుకుంటారు. ఇక కిలో లేదా రెండు కిలోల కెర్నల్స్‌ని కలుపుతారు.

ఇలా తయారు చేసుకోవాలి..

బలవర్థక బియ్యంలో జతచేర్చిన పోషకాలను కోల్పోకుండా ఉండాలంటే ప్రత్యేక వంట విధానాన్ని అవలంబించాలని అంగన్‌వాడీలు సూచిస్తున్నారు.

- ఫోర్టిఫైడ్ బియ్యం కడిగేటప్పుడు అతిగా రుద్ద కూడదు. వండే ముందు కొంతసేపు నీటిలో ఉంచి ఆ నీటిని ఒంపేయాలి. మరో మారు నీరు పోసి సున్నితంగా కడగాలి. తద్వారా పోషకాలు కోల్పోవు.
- అన్నం వండేటప్పుడు నెయ్యి, దాల్చిన చెక్క జీలకర్ర, యాలకులు, లవంగాలు వంటి దినుసులు జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఎప్పుడూ మూత పెట్టి ఉడికించాలి. తెరిచిన పాత్రలో వండితే పోషకాలు ఆవిరి రూపంలో కోల్పోవాల్సి ఉంటుంది.
- అల్యూమినియం కుక్కర్లకు బదులుగా స్టీలు గాజు, మట్టి పాత్రల్లో వండటం పోషకాల నిలుపుదలకు దోహదపడతాయి.

ఫోర్టిఫైడ్ రైస్‌లో ఉండే పోషకాలు..	
ఐరన్	42.5 మిల్లీ గ్రాములు
ఫోలిక్ యాసిడ్	125 మైక్రోగ్రాములు
విటమిన్ బీ12	1.25 మైక్రోగ్రాములు
జింక్	15 మిల్లీ గ్రాములు
విటమిన్ ఏ	700 మైక్రోగ్రాములు
విటమిన్ బీ1	1.5 మిల్లీ గ్రాములు
విటమిన్ బీ2	1.75 మిల్లీ గ్రాములు
విటమిన్ బీ3	20 మిల్లీ గ్రాములు
విటమిన్ బీ6	2.5 మిల్లీ గ్రాములు

చీరాల నియోజకవర్గ పరిధిలో..

చీరాల నియోజకవర్గ పరిధిలోని వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వేటపాలెం, చీరాల రూరల్‌లో 277 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు 0 నుంచి 3 సంవత్సరల్లోపు వారు 9,451 మంది, వీరిలో 3 ఏళ్ల నుంచి 6 చిన్నారులు 3,585 మంది ఉన్నారు. గర్భిణులు 1,600 మంది కాగా బాలింతలు 1,433 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెలా ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం 200 ఎంఎల్ పాలు, ఉడికించిన గుడ్డు ఇస్తున్నారు. అది కూడా ఆయా కేంద్రాలకు వచ్చి తినాల్సి ఉటుంది. 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు మాత్రం ఇంటికే సరుకులు ఇస్తున్నారు. అయితే ఈ వైఎస్సార్ సంపూర్ణ పోషణను పక్కాగా లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది.


సంపూర్ణ పోషణపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)


ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఫోర్టిఫైడ్ రైస్ ప్యాకెట్లు

ఎస్ఈఏఎస్ పరీక్షకు 502 మంది హాజరు


చినగంజాంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో


అద్దంకిలో పరీక్షలు నిర్వహిస్తున్న ఎంఈవో

అద్దంకి రూరల్: స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ ఎడ్యుకేషన్ సర్వే (ఎస్ఈఏఎస్) పరీక్షలకు అద్దంకి మండలంలోని 38 పాఠశాలలో శుక్రవారం నిర్వహించగా 502 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో సుధాకరరావు తెలిపారు. పరిశీలకులుగా ఎంఈవో 1,2 సుధాకరరావు, గంగాధరరావు, హెచ్‌ఎం కేఈ శ్రీనివాసరావు, వి. శ్రీనివాసమూర్తి, వి. శ్రీనివాసులు, రిసోర్సు టీచర్ జాషువా, సీఆర్‌పీలు రమేష్, రామకృష్ణ, పుణ్యవతి, గురవయ్య పాల్గొన్నారు.

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరు రాయల్ హైస్కూల్‌లో శుక్రవారం 3,6,9 తరగతుల విద్యార్థులకు స్కూల్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించారు. పరీక్ష నిర్వాహణ కోసం ఎంఈఓ 2 ప్రేమలత, స్థానిక వీరగంధం డిగ్రీ కళాశాల విద్యార్థినులు సానియ, సింధు, కావ్యలు ఫీల్డ్ ఇన్‌వెస్టిగేటర్స్‌గా వ్యవహరించారు. కరస్పాండెంట్ పీ రవీందర్ బాబు, ఇన్‌చార్జ్ కే మధుబాబు, హెచ్‌ఎం సుబ్రమణ్యంలు పర్యవేక్షించారు.

చినగంజాం: సీస్ పరీక్షను శుక్రవారం మండలంలో మొత్తం 15 పాఠశాలలో నిర్వహించారు. 3,6,9 తరగతులకు నిర్వహించిన పరీక్షలో మొత్తం 29 తరగతి గదులను కేటాయించి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఎంఈవోలు బీ అజయ్‌బాబు, ఎస్ కోటేశ్వరరావులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నకుమారి, సీఆర్పీలు సురేంద్ర, ఆశిష్, సునీల్, రామకృష్ణ పాల్గొన్నారు.


మార్టూరులో పరీక్షకు హాజరైన విద్యార్థులు


పర్చూరులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు

కారంచేడు: ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి మరింత దృష్టి సారించిందని ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని 11 ప్రాథమిక, 4 ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన విద్యా సాఫల్య సర్వే పరిశీలించారు. మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మాత్రమే సర్వేను నిర్వహించామన్నారు. సర్వేలో 313 మంది విద్యార్థులతో పాటు 41 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీని ఆదరించండి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

చీరాల రూరల్: దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బహుజనులు రాజ్యాధికార దిశగా పయనించాలని, అందుకుగాను ప్రతి ఒక్కరూ బహుజన్ సమాజ్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో బహుజన రాజ్యాధికార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓట్లువేసే అధికారంలేని మనందరికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓటు హక్కులు కల్పించారని, ఆ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని మన ఓటు మనం వేసుకుని రాజ్యాధికారం సాధిద్దామని పిలుపునిచ్చారు. బీసీలకు రానున్న ఎన్నికల్లో బీఎస్పీ ఆధ్వర్యంలో 100 సీట్లు కేటాయిస్తుందన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీ కేటగిరిలో చేరుస్తామని తెలిపారు. అలానే ప్రైవేటు రంగంలో కూడా బహుజనులకు రిజర్వేషన్లను కల్పించేందుకు కృషిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జులు ఎస్ఎస్. భగత్ సింగ్, చిట్టిమాల సంగీతరావు, నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, ఆశ్వీజ మాసం, పునర్వసు నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారని తెలిపారు.

క్రీస్తు ప్రవచనాలు అనుసరణీయం

చీరాల రూరల్: ప్రపంచ మానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని సీహెచ్ డేవిడ్ బెన్‌హం అన్నారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ప్రాంగణంలో గురువారం రాత్రి ప్రారంభమైన క్రీస్తు రెండో రాకడ సభలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. రెండు రోజులు పాటు ఏర్పాటు చేసిన ఈ సభలలో విజయవాడకు చెందిన అంతర్జాతీయ సువార్తికులు సీహెచ్ డేవిడ్ బెన్‌హం ముఖ్య అతిథిగా పాల్గొని దేవుని వాక్య సందేశాలు అందించారు. రెండు రోజులు పాటు నిర్వహించిన సభలకు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

నూతన శిలా విగ్రహాల ప్రతిష్ట

అద్దంకి : మండలంలోని వేలమూరిపాడు గ్రామంలోని ధేనువుకొండ పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించిన శివాలయంలో నూతన శిలావిగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా యంత్రజపాలు, త్రిశక్తి పూజ, వస్త్ర పంచశయ్యాధివాసం, కుంకుమ పూజలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ధేనువుకొండ కాలనీలో బొంతా సుబ్రమణ్యం (38) గురువారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

చీరాల టౌన్: ప్రభుత్వం మాతృ, శిశు మరణాలు జరగకుండా అన్నీ చర్యలు చేపట్టింది.. గర్భిణులు విధిగా వైద్య సేవలు పొందడంతో పాటు కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిపించుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. శుక్రవారం నవజాత శిశువు ఆరోగ్యం-తల్లీబిడ్డల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే కరణం బలరాంను కలిసిన సీఐ


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అదిస్తున్న సీఐ

చీరాల: చీరాల ఒన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శేషగిరిరావు శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. శాంతిభద్రతలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎమ్మెల్యే సూచించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ


బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

చీరాల టౌన్: దసరా పండుగను పురస్కరించుకుని ఎల్‌జీ కంపెనీ నిర్వహించిన లక్కీ డ్రాలో తోటవారిపాలేనికి చెందిన చేవూరి దేవికి ఎల్‌జీ డ్రీంహోం ప్యాకేజీలో విజేతగా నిలిచింది. శుక్రవారం ఆదిత్య కార్పొరేషన్ ఎల్‌జీ షాప్‌లో నిర్వహించిన బంపర్‌డ్రాలో విజేతగా నిలిచిన దేవికి రూ.5 లక్షల విలువైన ఎల్‌జీ గృహోపకరణాలను ఎల్‌జీ బ్రాంచ్ మేనేజర్ కిషోర్‌కుమార్, షోరూం నిర్వాహకులు టి.చంద్రమౌళీలు అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో ప్రత్యేక పూజలు చేసిన శాప్‌నెట్ చైర్మన్


ప్రత్యేక పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్య

అద్దంకి: మండలంలోని వేలమూరిపాడు పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వరాలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయలంలో అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ధేనువకొండ సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తిచేయాలి


బల్లికురవలో సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ ప్రసాద్

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలోని లేఅవుట్‌లు, స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను డిసెంబర్ 31 లోపు పూర్తి చేయించాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ జేడీ ఎస్కే ప్రసాద్ కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పరిషత్ క్యార్యాలయంలో 20 సచివాలయాల్లోని కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మండలస్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. మండలంలోని 14 లేఅవుట్లలో 238 గృహాలు మంజూరుకాగా 50 గృహాలు నిర్మాణ పనులు చేపట్టకపోవటం, సొంత స్థలాలకు 427 మంజూరు కాగా 50 గృహాలు నిర్మాణాలు చేపట్టకపోవటం, పీఎం ఎవైలో 468 మంజూరుకాగా 366 ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టకపోవటం పట్ల పీడీ అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి, ఏఈ దుర్గా రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, ఈవోఆర్డీ సుమతి, అధికారులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు కుట్టుమిషన్ల అందజేత


కుట్టు మిషన్‌లు అందజేస్తున్న తానా కోశాధికారి అశోక్ బాబు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు, యూఎస్‌ఏ తానా ఫౌండేషన్ సంయుక్తంగా పెద నందిపాడు రోటరీ క్లబ్‌కు ఆరు కుట్టు మిషన్‌లు అందజేశారు. శుక్రవారం స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో తానా కోశాధికారి కొల్లా అశోక్‌బాబు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్‌తో కలిసి సేవా కార్యక్రమాలు అందించటం సంతోషంగా ఉందని భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు తానా తరపున చేయూత అందిస్తామని తెలిపారు. పెదనందిపాడు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వై కోదండరామిరెడ్డి, వై రమణ, పూర్వపు అధ్యక్షుడు పోపూరి లక్ష్మీనారాయణలు తానా వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, సభ్యులు కోట హరిబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, దూళిపల్లి సత్యం, దండా శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, పాబోలు వెంకన్న, కోడూరు సుబ్రమణ్యాచారి, కోమటి ఆంజనేయులు, కారుమూడి సుబ్బారెడ్డి, కార్యక్రమానికి సమన్వయకర్త రావి సత్యనారాయణ పాల్గొన్నారు.

బెట్టను తట్టుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి


మిరప పంటను పరిశీలిస్తున్న జెన్నమ్మ

మార్టూరు: బెట్ట వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి పీ జెన్నమ్మ సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలోని మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు, బెట్ట పరిస్థితుల వలన రసం పీల్చే పురుగులైన తామర పురుగు.పేనుబంక, తెల్లదోమ ఉధృతి అధికమై తద్వారా వైరస్ తెగుళ్ల అధికంగా వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ పరిస్థితులను అధిగమించి మిరప మొక్కలు ఎదుగుదల పెంచుటకుగాను తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ పథకాలు


పథకాల లబ్ధిని వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

గడప గడపలో శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొటికలపూడి పంచాయతీ పరిధిలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆర్థికంగా మహిళలు ఎదగాలన్న ఉద్దేశంతోనే ఇంటి పట్టాలు, పక్కాగృహాలు, పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. నిరంతరం శ్రమించే జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా చెయ్యాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని చైతన్య అన్నారు. పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, ఎంపీపీ అవిశెన జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జుల జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.